క్లుప్తంగా

చంద్రా రాజేశ్వరరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల (న్యూటౌన్): స్వాతంత్య్ర సమరయోధుడు, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నేతలు బాబాఫక్రుద్దీన్, ప్రసాద్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాణానికి, పేదల సాగు భూములు, ఇండ్ల స్థలాల కోసం ఆయన ఎన్నో పోటాలు చేశారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో లెనిన్ అవార్డు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సోమన్న, ఖలీల్, మాబాష, ఉశేన్, రాంబాబు, మహేంద్ర పాల్గొన్నారు.

తల్లీకొడుకుపై కేసు

రుద్రవరం: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న తల్లీ కొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెద్దకంబలూరుకు చెందిన లక్ష్మీదేవి, ఆమె కుమారుడు శివ కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. కర్ణాటకకు చెందిన 9 ఫుల్‌బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కుమారుడు లారీ డ్రైవర్ కావడంతో కర్ణాటకు వెళ్లినప్పుడు అక్కడి నుంచి మద్యం సీసాలు తీసుకొచ్చేవాడని.. వాటిని తల్లి విక్రయించేదని తెలిపారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంజీవనగర్, బైటిపేట కోదండరామాలయం, ఎస్బీఐ కాలనీ రామాలయం నూనెపల్లెలోని సీతారామాంజనేయ దేవాలయం, మూలసాగరంలోని కోదండ రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రామాయణ పఠనం చేశారు. స్వామివార్లకు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, పూలంగి సేవ, అర్చనలు, సింధూర అర్చనలు నిర్వహించి మహామంగళ హారతులు సమర్పించారు. సాయంత్రం సంజీవనగర్ రామాలయంలో స్వామి అమ్మవార్లకు వేదపండితులు పవన్ శర్మ, కార్తికేయ శర్మల ఆధ్వర్యంలో ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా



గోవిందపల్లెలో ట్యాంకర్ నుంచి నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లెలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి ట్యాంకర్ల ద్వారా గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. మొత్తం 7,598 మంది జనాభా ఉన్న గ్రామంలో కొద్ది రోజుల నుంచి భూగర్భ జలాలు తగ్గిపోయాయి. గత నెలలో కుంటకు కేసీ కెనాల్ నీటిని నింపారు. అవి రోజు రోజుకు తగ్గిపోతున్నాయి. వారం నుంచి సమీప బావుల నుంచి రోజుకు 5 ట్యాంకర్ల ద్వారా నీటిని గ్రామంలోకి తీసుకొచ్చి ప్రజలకు అందిస్తున్నారు. రోజుకు రూ. 10 వేల ఖర్చు అవుతోందని ఆయన తెలిపారు.

ఓంకార సిద్ధేశ్వరస్వామికి రుద్రాభిషేకం

మహానంది: ఓంకారంలో కొలువైన శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ ఏ.నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉదయాన్నే స్వామి, అమ్మవార్లను పుష్పాలతో అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన పూజలు వైభవంగా చేపట్టారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురంలో ఇంటి రస్తా విషయంలో జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ మంగళవారం తెలిపారు. సీతారామాపురం గ్రామానికి చెందిన హరికృష్ణపై ఇంటి రస్తా విషయంలో అదే గ్రామానికి చెందిన గుర్రప్ప, శ్రీను, లక్ష్మినారాయణ, శివతోపాటు మరి కొంత మంది గొడవపెట్టుకొని దాడి చేశారు. హరికృష్ణతోపాటు అతని భార్య లావణ్య గాయపడ్డారు. తెలుగు రామ సుబ్బమ్మపై హరికృష్ణ, లావణ్య దాడి చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కౌంటర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల భవితకు భరోసా

- అమ్మ ఒడి పథకంతో పేద విద్యార్థులకు అండ
- గోస్పాడు మండలంలో 5,928 మంది లబ్ధిదారులు
- నాలుగేళ్లలో రూ.25.92 కోట్లు లబ్ధి
- పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ చదువు మానేయకూడదని ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన అమ్మ ఒడి పథకం సత్ఫలితాలను ఇస్తోంది. ఈ పథకం నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తోంది. వారి పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇస్తోంది. ఏటా విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేలు చొప్పున నిధులు జమ చేస్తున్నారు. వీటితో పాటు ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారికి విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నారు.



తరగతి గదిలో విద్యార్థులు

గోస్పాడు: విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలను తీసుకొచ్చారు. అమ్మ ఒడి, మనబడి, నాడు-నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, డిజిటల్ విద్య, జగనన్న విద్యాకానుక వంటి పథకాలు అమలు చేస్తూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారు. పేద, మధ్య తరగతి పిల్లల చదువులకు ఆర్థిక భరోసా కల్పించారు. పిల్లల చదువులపై ఆందోళనతో ఉన్న తల్లులకు ఈ పథకాలతో కొండంత ధైర్యాన్ని ఇచ్చారు. ఫలితంగా తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. మండలంలో అమ్మఒడి కింద నాలుగేళ్లలో రూ 25.92 కోట్లు అందించారు. అర్హులైన ప్రతి కుటుంబంలో ఒక విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు అందించారు. దళారుల బెడద లేకుండా నేరుగా తల్లి బ్యాంకు ఖాతాలోకి నగదు జమచేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో వివరాలు

పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలు చైల్డ్ ఇన్ఫోలో ఉంచారు. విద్యార్థుల పేరు, తల్లి, సంరక్షకుల బ్యాంకు ఖాతా నంబర్, బ్యాంక్ ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్, ఆధార్, రేషన్ కార్డుల వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచేలా చర్యలు తీసుకున్నారు. ఏదైనా లోపాలు ఉంటే పాఠశాల హెచ్‌ఎంను సంప్రదించి సరిదిద్దుకునే అవకాశాన్ని కల్పించారు.

టాయిలెట్ల నిర్వహణకు రూ.వెయ్యి

అమ్మఒడి పథకం కింద విడుదలయ్యే రూ.15వేలులో రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. మిగిలిన రూ.2 వేలను డిస్ట్రిక్ టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ (డీటీఎంఎఫ్)కు రూ. వెయ్యి, డిస్ట్రిక్ స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ (డీఎస్ఎంఎస్)కు రూ.వెయ్యి జమ చేస్తుంది. విద్యార్థులకు వసతులు కల్పించడంలో వారిని కూడా భాగస్వామ్యం చేసింది.

నాలుగేళ్లలో అమ్మఒడి కింద అందించిన మొత్తం వివరాలు

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	జమ అయిన మొత్తం (రూ.కోట్లలో)
2020-21	4170	6.25
2021-22	3656	5.11
2022-23	5276	6.86
2023-24	5928	7.70

కొండంత అండ

మండలంలో 12 గ్రామ సచివాలయాల పరిధిలో 36 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాలుగేళ్లలో తల్లుల ఖాతాల్లో రూ.25.92 కోట్లు జమ చేశారు.

వరంగా మారింది



మా అబ్బాయి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అమ్మ ఒడి పథకం ద్వారా నా బ్యాంకు ఖాతాలో రూ. 15 వేలు జమ అవుతోంది. ఈ పథకం పేద విద్యార్థులకు వరంగా మారింది. ముఖ్యమంత్రి జగన్ గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలను అభివృద్ధి చేశారు. అన్ని వసతులతో విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేశారు.

–కాశమ్మ విద్యార్థి తల్లి, చాబోలు

చదువుకు ఆటంకం లేదు



ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్ పాఠశాలలతో ధీటుగా అన్ని వసతులు ఉండేలా తీర్చిదిద్దారు. ఉచితంగా ఇంగ్లీష్ మీడియం చదువులు చెబుతున్నారు. అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15 వేలు అందిస్తున్నారు. అది కూడా తల్లి బ్యాంక్ అకౌంటులో జమ చేయడం మాకెంతో అనందంగా ఉంది.

–శిరీష, విద్యార్థిని, గోస్పాడు

ఇబ్బందులు లేకుండా చదువు



మా అమ్మ ఖాతాకు నాలుగేళ్లుగా అమ్మఒడి కింద రూ.13 వేలు జమ అవుతోంది. ఈ సాయంతో మాకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చుతోంది. చదువుకోడానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ ఎదురవ్వడం లేదు. ప్రభుత్వ పాఠశాలను విద్యార్థులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దడంతో రూపురేఖలు మారిపోయాయి.

–మణికంఠాచారి, విద్యార్థి

అమ్మఒడి ఆదుకుంటోంది



గతంలో పోల్చితే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు ఎంతో మార్పు చెందాయి. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. విద్యార్థులకు పాఠశాల తెలిచిన వెంటనే పుస్తకాలు, యూనిఫాం, షూ అందిస్తున్నారు. గోరుముద్దతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అమ్మ ఒడితో కష్టం తెలియకుండా పిల్లలను చదివించుకుంటున్నాం.

–విజయ శేఖర్, విద్యార్థి తండ్రి గోస్పాడు

వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: మున్సిపల్ పరిధిలోని పడకండ్లలో టీడీపీని వీడి 150 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన కొంకల క్రిష్టారెడ్డి, బద్రి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ బత్తుల సుబ్బరాయుడు, మైసూర్ ఓబులేసుతో మరికొందరికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈశ్వరయ్య, సాంబశివుడు, రామక్రిష్ణ, లక్ష్మీనరసయ్య, నరసింహా బ్రదర్స్, ఖాశీంవలి, మద్దూరు శ్రీను, వెంకటరమణ, కరిముల్లా, చంద్ర, ఓబులేసు, కరీముల్లా, హేమంత్, ధర్మ, అనిల్, వంశీ, సంజీవ బ్రదర్స్, తదితరులు ఉన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనం

చాగలమర్రి: స్థానిక టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టు వద్ద మంగళవారం తిను బండారాలతో వెళుతున్న మినీ లారీని పోలీసులు తనిఖీ చేశారు. అందులో తెలంగాణా రాష్ట్రానికి చెందిన 11 ఫుల్ బాటిళ్లు గుర్తించారు. వైఎస్సార్ జిల్లా అట్లూరు మండలం మన్నెంవారిపల్లె గ్రామానికి తరలిస్తున్నట్లు తెలిసింది. వాహనాన్ని సీజ్ చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మన్నెం మధుసుదన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చాగలమర్రి ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. అలాగే నారాయణపల్లె రస్తాలో పెద్దవంగలి గ్రామానికి చెందిన దద్దనాల నాగిన్‌బాషా నుంచి 19 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

మల్లన్నను దర్శించుకున్న జేసీ రాహుల్‌రెడ్డి



జేసీకి స్వాగతం పలుకుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన జాయింట్ కలెక్టర్ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబా దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపం వద్ద జాయింట్ కలెక్టర్ దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

మల్లన్న సేవలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి

శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన పీఠాధిపతికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పీఠాధిపతి మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు.

వైభవంగా కంబగిరిస్వామి ఉత్సవాలు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న తేరుబండి



లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఉగాది సందర్భంగా ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. సాయంత్రం అల్లూరు, సుద్దమల్ల, ఉయ్యాలవాడ గ్రామస్తులు తేరుబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్థానికులతో పాటు జమ్మలమడుగు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. రైతులు పండితులు సూచించిన దిశకు వెళ్లి పొలాల్లో సేద్యపు పనులను ప్రారంభించారు. ఆలయ చైర్మన్ కంపరాజు శ్రీనివాసులుగౌడ్, కార్యనిర్వహణాధికారి చంద్రుడు, కమలేష్‌శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తెలుగు లోగిళ్లలో ఉగాది ఉషస్సు



నంద్యాల: సుంకులా పరమేశ్వరి అమ్మవారు



రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- స్వామివార్లకు విశేష పూజలు
- పంచాంగ శ్రవణం చేసిన పండితులు
- రంగులు చల్లుకుని సందడి చేసిన యువత

నంద్యాల(వ్యవసాయం)/నంద్యాల అర్బన్: క్రోధి నామ సంవత్సరం ఉగాదిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లముందు తెలుగుదనం ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి. అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. నంద్యాల పట్టణంలోని వన్‌టౌన్, టెక్కె, నూనెపల్లె, గిరినాథ్ సెంటర్, సాయిబాబానగర్, మూల సాగరం, బొమ్మల సత్రంలో యువతీయువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. బైటిపేట ఆంజనేయ స్వామి, మెయిన్‌బజార్‌లోని సుంకులమ్మ, ప్రథమ నంది, భావనారుషి, బసవేశ్వర స్వామి ఆలయం, సుంకులాపరమేశ్వరి, పప్పులబట్టి బజారులోని పెద్దమ్మ, బైటిపేట చౌడేశ్వరిదేవి, సంజీవనగర్ రామాలయాల్లో విశేష పూజలు చేశారు.

➡ రుద్రవరం: వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగాన్ని చదివి వినిపించారు. బైరి వెంకటమ్మ, చిన్నపుల్లమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరుగు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

➡ శిరివెళ్ల/గోస్పాడు: స్థానిక మారెమ్మగుడి వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, నీటిని పంపిణీ చేశారు. గోస్పాడులో చిన్నాపెద్దా రంగు బండ్ల ద్వారా రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.



దొర్నిపాడు: పెద్దమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి



సంజీవనగర్ వేంకటేశ్వరస్వామి



చాగలమర్రి కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

➡ దొర్నిపాడు: డబ్ల్యూ గోవిందిన్నెలోని మూల పెద్దమ్మ, గుండుపాపల, క్రిష్టిపాడు గ్రామాల్లో మారెమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

➡ మూలపెద్దమ్మను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అక్క అవంతికారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కర్నాటి కృష్ణారెడ్డి, జాకీర్‌బాషా, డీలర్ పెద్దన్న, వరప్రసాద్, రఫీ, శాంతయ్య, కరిముల్లా, చిన్నమద్దిలేటి పాల్గొన్నారు.

➡ చాగలమర్రి: స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార లక్ష్మణబాబును సన్మానించారు. అనంతరం వేద పండితులు కై వ వెంకటనరసింహాశాస్త్రితో పంచాంగ శ్రవణం నిర్వహించారు.



సంజీవనగర్ రామాలయంలో పంచాంగ శ్రవణం



కోటపాడులో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



దొర్నిపాడు: ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ



రుద్రవరం: వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



బైటిపేట ఆంజనేయస్వామి



చాగలమర్రిలో..

మహానంది ఆలయం మరింత అభివృద్ధి



మహానందిలో పంచాంగ శ్రవణం పూజలు చేస్తున్న పండితులు, ఈఓ దంపతులు

- పంచాంగ శ్రవణంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని
- ఈ ఏడాది ఎరుపు పంటలకు అనుకూలం

మహానంది: క్రోధినామ సంవత్సరంలో మహానంది ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని మహానంది దేవస్థానం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా మహానందిలో మంగళవారం రాత్రి పంచాంగ శ్రవణం కార్యక్రమం చేపట్టారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ.. మహానంది ఆలయం దిన దినాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఏడాది ఎరుపు రంగు పంటలకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. మిశ్రమ ఫలితాలు ఉన్న రాశుల వారు ఎలాంటి ఆందోళన చెందకుండా నిత్యం దైవనామస్మరణ చేయడం ద్వారా కష్టాలు తొలగిపోతాయన్నారు.

మహానందీశ్వరుడి దంపతులకు తిరుమంజనం

ఉగాది పర్వదినం పురస్కరించుకుని మహానందీశ్వరుడి దంపతులకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఆలయ శుద్ధి చేసి శ్రీ కామేశ్వరీదేవికి ఖడ్గమాలార్చన, మహానందీశ్వరుడికి రుద్రాభిషేకం, ఉత్సవమూర్తులకు తిరుమంజనం, నింబ కుసుమ భక్షణ నివేదించారు.

కన్నడ భక్తులతో కిటకిటలాడిన మహానంది

ఉగాది సందర్భంగా మహానంది ఆలయం కన్నడ భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం తెల్లవారుజామున ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం బుధవారం తెల్లవారుజాము వరకు నిర్విరామంగా కొనసాగింది. శ్రీశైలంలో రథోత్సవం అనంతరం సాయంత్రం నుంచి రాత్రి వరకు వేలాది సంఖ్యలో కన్నడిగులు మహానంది ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తమ ఆడపడుచులు, అల్లుళ్ల కోసం చాటలు, పట్టుడు కర్రలు, బొమ్మలు కొనుగోలు చేసుకుని వెళ్లారు.



ఉత్సవమూర్తులకు తిరుమంజనం



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న మహానంది